# ప్రణయ పరిణామం

పద్మ లేచి పోయిందనీ, ఆమె కోసం తండ్రి నర్సయ్య దేశమంతా గాలిస్తున్నాడనీ తెలుసుకున్నప్పుడు కనకారావుకు మతిపోయినట్లయింది.

పద్మ...ఎంత పని చేసింది! లేచిపోవడమే! ఎవడితో?-ఎవడో యువకుడు ఆ అదృష్టానికి పాత్రుడై వుంటాడు!...వాడు...ఎవడైతే నేం...ఒక రావణాసురుడు!

ఆ పిల్లని నరసయ్య వాళ్లూ వెతుకుతున్నారు. చెన్నపట్నం కూడా మనుషుల్ని పంపించారు.

నరసయ్య వెతక్క ఏం చేస్తాడు? అసాధ్యుడు నరసయ్య! కాని పద్మ లేచిపోయి ఆ కుటుంబానికి చాల అప్రదిష్ట తెచ్చింది. నీతికీ నిజాయితీకీ ఆ ఊళ్ళోని ఆ కుటుంబంలో, ఆడవాళ్ళు ఎన్నడూ సంఘంచేత నిందించబడే తప్పు చేసి వుండలేదు. అటువంటిది...పద్మ లేచి పోయిందంటే-పాపం...నరసయ్య ఎంతగా కుమిలిపోతున్నాడో...!

ఏమైనా పద్మ లేచిపోయి నరసయ్యకు గట్టిగా బుద్ధి చెప్పింది! లేకుంటే నరసయ్యకు అంత పట్టుదలా! వ్యక్తిగత ద్వేషాలు పెంచుకొని-ఆ అమాయకురాలి యవ్వనం విషయం ఆలోచించకుండా, ఆమెను పెద్ద మనిషైన రెండు సంవత్సరాలకు కూడా, భర్త దగ్గరకు పంపకుండా ఇంట్లో అట్టే పెట్టుకున్నందుకు...లేచిపోయి పద్మ తగినశాస్తే చేసింది!

వియ్యంకుడికీ, తనకీ మధ్య మాటమీద మాటవొచ్చి విరోధం బలుస్తే— పాపం యవ్వనపు పొంగు ఉత్సాహంలో ఉన్న ఆ పిల్ల గతేం కాను? ఆమె అట్లా భర్తకు దూరమై ఉండాల్సిందేనా? పద్మ ఉత్తమమైన పనే చేసింది!

కాని ఆమె అటువంటి స్వభావం కలదికాదే...ఎట్లా సాహసం చేసిందబ్బా!...ఏమో...యవ్వనం కలిగించే కోర్కెల పదునుకు తట్టుకో లేక పోయిందేమో...!

అయితే-తనని ఆ రోజు...తిరస్కరించిందే మరి! ఎందుచేత?

ఆ తలపు మనస్సులోకి రాగానే కనకారావు ఒక విధమైన ఆవేశంతో వూగిపోయాడు.

తనని పద్మ తిరస్కరించింది. కాదు, కాదు...తనే జాలితలచి, ఆమె విధికి ఆలోచించి, ఆమె కుటుంబ గౌరవాన్నీ, సభ్యతనీ, హోదానీ గమనించి, తను ఆరోజు పద్మతోటి అనుభవాన్ని తృణీకరించాడు. మనస్సుని నిగ్రహించుకున్నాడు. త్రాచుపాము బుసలాగ రేగిన కోర్కెల్ని, ఉద్రేకాన్ని—అణచుకున్నాడు. ఆమెని తీవ్రమైన ఉద్రేకానికి గురిచేసి పిరికివాడిలా తిరిగి వచ్చాడు. అవకాశం ఉన్నా తను వినియోగించ లేదు. ఆ పిల్ల అమాయకత్వం, ఆమె చుట్టూ ఆవరించివున్న పరిస్థితులు-తనలోని కామాన్ని జోకొట్టాయి. తను ఏం చేస్తాడు?

—బంధువుల ఇంటికి వెళ్ళాడు. అక్కడ నుంచి ఆ సాయంత్రం నరసయ్య ఇంటికి వట్టినే చుట్టపు చూపుగా పలకరించి వొచ్చేందుకు వెళ్ళాడు. కాని నరసయ్య ఇంట్లోలేడు; పనిమీద పక్క గ్రామం వెళ్ళాడు. పద్మ తల్లి మర్యాదచేసి కూర్చోబెట్టింది. కొంతసేపు ఉన్న తరువాత ఆవిడ చావట్లోకి వెళ్ళింది. ఇక ఇంట్లో పద్మ ఒక్కతే! ఆమెను తను చూసి అప్పటికి చాలా రోజులైంది. ఎట్లా ఎదిగిందో, ఆమె అందం ఏ మోతాదులో ఉందో,-చూడాలన్న కాంక్ష తనలో హెచ్చిపోయింది. కాని అంతలోనే తనలో పిరికితనం ఎవరేనా చూస్తా రేమోనని, పద్మ ఏమనుకుంటుందోనని; ఆమెతో తనకు ఎక్కువ పరిచయం లేదు.

'పద్మా! మంచి నీళ్ళు ఇస్తావూ?' అంటూ ఇంట్లోకి వెళ్ళాడు.

పద్మ కుర్చీలో కూర్చొని లేసు అల్లుకుంటోంది. ఆకు పచ్చ సిల్కు పరికిణీమీద గులాబి రంగు జార్జెట్ సిల్కు వోణీ వేసింది; గుండ్రటి కంఠం క్రింద తళ తళ లాడే రాళ్ల నెక్ లెస్ ఆమెకు కొత్త అందాన్ని చేకూర్చింది.

తనని చూసి దిగ్గున లేచింది. దెబ్బ తిన్న లేడిలా భయంతో అటూ ఇటూ చూసింది. తనలో ఒక్కసారి...ఉద్రేకం, ఉత్సాహం ఉప్పొంగాయి. తన కౌగిల్లోకి నిండుగా సరిపోయే ఆమెను గట్టిగా కౌగిలించుకొని, అదిరే ఆమె బుల్లి పెదాల్నీ, చెంపమీది నునుపునీ, కనురెప్పల సొగసునీ, తనివితీరా ముద్దుపెట్టుకోవాలన్న వాంఛ తనలో అంతలోనే అంతకు అంతై, శరీరమంతా వ్యాపించి తనని మోహంలో ముంచివేసింది. ఆమెను సమీపించాడు. ఆమె వొణుకుతోన్నట్టు గమనించాడు. తనలోని మోహం కట్టలు తెంచుకున్న ప్రవాహమైంది. ఆమెను కౌగలించుకున్నాడు. పెదాల్నీ, చెంపల్నీ, కంఠం కిందా-ముద్దుపెట్టుకున్నాడు. ఆమె కూడా తీవ్రమైన ఉద్రేకానికి గురైనట్టు గమనించాడు. కొంచెం దూరంలోనే గదిలో పందిరిమంచం, మంచంపైన పట్టుపరుపు—తనలో ఉద్రేకం మరీ అధికమైంది...

కాని మనస్సులోని మనస్సు ఎదురు తిరిగింది! పద్మ స్వభావం ఎటువంటిది? పాపం! అమాయకురాలు—పురుషుడి బలవంతానికి జావై పోతుంది! ఆమె ఎటువంటి పరిస్థితుల్లో ఉంది? తండ్రీ, మామల విరోధాల వల్ల భర్తకు దూరమై వుంది. అటువంటప్పుడు తను ఆమె శీలాన్ని అపవిత్రం చేస్తే—ఆమె భావిగతి ఏమిటి? ఆమె కుటుంబ గౌరవం, హోదా, పరువూ—స్త్రీగా ఆమె పొందేనిందలూ - తన పరువు ప్రతిష్ఠలు ఏమౌతాయి?...అ విధంగా తను ఆలోచించాడు.

తన హృదయం ఎదురు తిరిగింది. కోర్కెల్లోని పటుత్వం జారిపోయింది. ఆమె బ్రతుకుమీద జాలి, ఆమె తన నుంచి ఆక్షణంలో పొందిన సానుభూతి-తనలో పరివర్తనను తెచ్చినాయి.

ఆమెని కౌగిల్నించి వొదిలేశాడు. ఆమె ముఖం వంక చూసేందుకు-ముఖం చెల్లక వెంటనే బయటికి వొచ్చేశాడు. ఆమెని అటువంటి కీలక

పరిస్థితుల్లో శీలాన్ని చెఱచకుండా విడిచిపెట్టి నందుకు తను చాలారోజులు తన ఆత్మ బలానికీ, నీతికీ, అవలంబించిన విధానానికీ—తనకు తానే గర్వ పడుతూ వొచ్చాడు.

—కాని పద్మ లేచిపోయింది! తను ఆశించిన నీతీ, ఔన్నత్యం, సౌశీల్యం-ఆమెలో లేవు; ఉద్రేకానికి లోనై, చవుకబారు ప్రణయానికి గురై ఉంటుంది. పరిపూర్ణత ఏర్పడని జీవితంమీద నల్లని ముసుగు గుడ్డను చూసి సంఘం వికటాట్టహాసం చేస్తుంది...పద్మ జీవితం ఏమవుతుంది?

ఆలోచనతో కనకారావు గదిలో అటూ యిటూ పచార్లు చేస్తున్నాడు. ఎంత ఆలోచించినా అతను ముందుకు సాగలేక పొయ్యాడు.

★

రెండు మాసాలు గడిచినై.

ఏదో ఓ పనిమీద కనకారావు విశాఖపట్టణం వెళ్ళాడు. పని పూర్తి చేసుకోనేందుకు రెండు రోజులు టైం కావాల్సి వొస్తుందన్న ఉద్దేశ్యంతో-వేరే బంధువు లెవరూ లేనికారణం చాత-హోటల్లో గది అద్దెకు తీసుకున్నాడు. ఆ రాత్రి పిక్చర్ ప్యాలెస్‌లో ఇంగ్లీషు సినిమా చూసి వచ్చి పడుకున్నాడు.

చాలాసేపటివరకూ నిద్ర పట్టలేదు. ఆలోచిస్తో కన్ను మూశాడు. కాని అరగంటలోనే మెలకువ వొచ్చింది. పక్క-గదిలో స్త్రీ, పురుష కంఠాలు అతనికి వినిపించ సాగినాయి. చెవియొగ్గి వినేందుకు సంసిద్ధుడైనాడు. కొంతసేపటికి ఆ కంఠాల్లో తీవ్రత ప్రవేశించటంతో-వాళ్లు కీచులాడు కుంటున్నారనే అభిప్రాయానికి కనకారావు అతిసులభంగా వొచ్చాడు. వాళ్ళ కీచులాడుటకు మూలకారణాన్ని, పర్యవసానాన్ని వినాలనే కుతూహలం అతనిలో బాగా ఏర్పడింది. మొదట్లో అస్పష్టంగా వినపడ్డ వాళ్ళ సంభాషణ క్రమేపీ పెద్దగా మాట్లాడుకోవటం చాత—దాదాపు స్పష్టంగానే వినపడేందుకు అతనికి అవకాశం కలిగింది.

'నాకు డబ్బు కావాలి' పురుషుడి కంఠం.

'ఎందుకు?' స్త్రీ కంఠం.

'ఆ ప్రశ్న అనవసరం. నాకు డబ్బు కావాలి. అంతే! ముందు డబ్బు ఇవ్వు—ఆ తరువాత నీ ప్రశ్నకు జవాబు చెబుతాను'

'నాదగ్గర డబ్బు ఎక్కడిది?'

'నువ్వు అట్లా అంటావని నాకు తెలియక కాదు, నేను నిన్ను మరీ మరీ అడిగేది. నాచాత ఆక్టే వాగించుకోకుండా ముందు పాతిక రూపాయలు ఇవ్వు' స్వరం హెచ్చింది.

'నాదగ్గర లేవని ఎన్నిసార్లు చెప్పాలి?' విసుగూ, అసహ్యం ఆ స్వరంలో ధ్వనించాయి.

'నాకు డబ్బే అక్కర్లేదు. డబ్బును యిచ్చే వస్తువులైనా సరే! ఆ వస్తువులు నీ దగ్గర ఉన్నాయి.'

'నా జీవితాన్ని నాశనం చేశావు. మాయమాటలుచెప్పి, అరిచేతిలో స్వర్గం చూపిస్తానని ఇక్కడకు తీసుకువచ్చి నన్ను నానాహింసలు పెడుతున్నావు. నువ్వు మనిషివి కావూ! ఒకపరువు గల కుటుంబంలో జీవించే ఆడదాన్ని తీసుకువచ్చి, డబ్బూ, నగలూ విలాసంగా ఖర్చుపెట్టుకుంటున్నావు. నీ మోసాన్ని, స్వార్థాన్ని నేను సహించలేను. నన్ను నీవు అన్యాయం చేశావు' ఆ కంఠంలో జాలి, కోపం, రోషం, అమాయకత్వపు బరువూ మిళితమైనై.

వికటంగా పురుషుడి నవ్వు.

'నేను అన్యాయం చేశానా? నీ యవ్వనపు పొంగు చల్లార్చుకోనేందుకు నావెంటపడి వొచ్చావు. అది కాస్తా చల్లారగానే నామీదపడి ఏడుస్తున్నావు! నీతో నాకు వాద మెందుకు? మర్యాదగా ఆ మెడలో మెరిసే గొలుసు ఇస్తానంటావా, బలవంతంచేసి తీసుకోమంటావా?'

'ఆఁ! అంతపనీ చేస్తావా?'

'లెక్కలేకుండా—'

'దుర్మార్గుడా! చివరకు నన్ను కూడా అమ్మేందుకు సంసిద్ధమవుతున్నావా? ఈ ఆడదాని ఉసురు నీకు తగలక పోదు. ఏమైనా నేను ఈ గొలుసు ఇవ్వను. నేను మా వూరు వెళతాను.'

'గొలుసు ఇవ్వవూ? మీ ఊరు వెళతావూ! ఎట్లా గొలుసు ఇవ్వవో చూస్తాను.'

'ఆఁ!...అమ్మో! కత్తి...పొడుస్తావా? అమ్మో...అయ్యో! ఈ దుర్మార్గుడు నన్ను చంపబోతున్నాడు.' అని స్త్రీ కేకలు.

ఇవతల రూంలోని కనకారావు కంపించి పోయాడు. ఎవడో దుష్టుడు స్త్రీని బలవంతంచేసి డబ్బు లాగాలని చూస్తున్నాడు! మోసానికి గురైన అనాధ!

కనకారావు గబగబా హోటలు మేనేజర్నూ, మరి నలుగుర్నూ గది దగ్గరకు పిలుచుకొని వచ్చాడు. వాళ్ళు గబగబ తలుపులు కొట్టేసరికి లోపలివాడు భయపడి తలుపులుతీసి-ఇంతమంది మనుషుల్ని చూసితప్పించుకొని పారిపోయాడు.

'పద్మా-!' అన్నాడు కనకారావు. అతన్ని చూసి బావురుమని ఏడ్చిందామె.

ఆమె తన చుట్టమేననీ, ఎవడో మోసంచేసి లేపుకొచ్చాడనీ హోటలు యజమానికీ, అక్కడ ఉన్నవారికీ చెప్పాడు కనకారావు. వాళ్ళు నమ్మారు. తను ఆమెను జాగ్రత్తగా వాళ్ళ ఇంటికి చేరుస్తానని కూడా చెప్పాడు. వాళ్లు ఆ విధంగా చేయటమే ఉత్తమమైన పసి అని ఒప్పుకున్నారు.

కనకారావు ఆమెను తన రూంలోకి తీసుకు వచ్చాడు.

ఆమెకు కింద, పక్క అమర్చాడు. బెడ్ మీద పడుకున్నాడన్న మాటేగాని కనకారావుకు పలువిధాలైన ఆలోచనలు పోయినై. ఆమె ఎందుకు లేచి వొచ్చిందో అడగాలనుకున్నాడు. కాని అలా అడిగిన పక్షంలో—ఆమె మనస్సు నొచ్చుకుంటుందని సంకోచించాడు.

...పద్మ చెడిపోయింది ఆమెను తను రక్షించాడు. తను లేకపోతే—ఎన్నికష్టాల పాలయ్యేదో...తను ఎందుకు రక్షించాడు? ఆమె పద్మని తెలీక ముందే తను ఒక దిక్కుమాలిన స్త్రీకి అన్యాయం జరుగుతూంటే సహించలేక రక్షించేందుకు సంసిద్ధుడయ్యాడు. ఆమె 'పద్మ' అయిన తరువాత తనకిన్ని ఆలోచనలు దేనికి? ఆమెను వాంఛిస్తున్నాడా? ఛీ...ఛీ...ఏం? ఆమె శీలం చెడినప్పటికీ అందం చెడలేదు. ఆమెను తను కోరడంలో అన్యాయం ఏముంది? ఎటు దిరిగీ తను కొత్తగా ఆమె శీలాన్ని చెడగొట్టటం లేదుగదా?

—తనకి తగినంత అవకాశం ఉంది. తనకి పద్మమీద ఎప్పుడూ కోర్కె ఉంది. ఆ రోజు ఆమె భవిష్యత్తుని ఆలోచించి-జాలి తలచి విడిచి పెట్టాడు. ఆ రోజు ఆమె భవిష్యత్తు తేలిపోయింది. తనకి జాలి తలచవలసిన అగత్యం లేదు.

చాపమీద పడుకొన్న పద్మవంక చూశాడు, కనకారావు. డిమ్ లైట్ కాంతిలో ఆమె చాలా మనోహరంగా అగపడింది. అంతలోనే వుద్రేకాన్ని ఉద్వేగాన్ని పెంచుకున్నాడు. మెల్లిగా బెడ్ మీద నుంచి లేచాడు. ఆమె ముఖం దగ్గరకు వెళ్ళి కూర్చున్నాడు.

తను చేస్తోన్న పనేమిటి?

ఒక దుర్మార్గుని దుర్మార్గాన్నుంచి ఆమెను రక్షించి-ఆమె శరీరాన్ని వాంఛించడమా? తన రక్షణలోని అంతరార్థం స్వార్థమేనా? తను ఎంత నీచుడు! తనకి స్త్రీ అంటే గౌరవం లేదు. ఒక చెడిన వస్తువుమీద తనకీ భ్రమ ఏమిటి? శీలం చెడిపోయిన స్త్రీని అనుభవించటంతో—ఆమెకు ప్రత్యేకంగా పురుషుడు చేసే అన్యాయం ఏమీ లేదని తను ఆత్మవంచన చేసుకోవట మేమిటి?

కనకారావు ఆమెను అంటుకోనకుండా మళ్ళీ తన బెడ్ మీదకు వచ్చాడు. ఎప్పుడో తెల్లవారు ఝామున అతనికి నిద్ర పట్టింది.

మరునాడు ఉదయం పద్మతో అన్నాడు:

'మనం రేపు వెళదాం. ఈ ఊళ్ళో నేనొచ్చిన పని కాలేదు.'

సరే నన్నది పద్మ.

ఆ హోటల్నుంచి మారి కనకారావు మహారాణి పేటలో మరో హోటల్లోకి పద్మను తీసుకు వచ్చాడు. ఆ సాయంత్రం బీచికి వెళ్ళారు. బాగా వెన్నెల వొచ్చేవరకూ అక్కడే ఉన్నారు. వెన్నెల తెలుపుకు నీటి నురుగులు మెరుస్తోంటే సముద్రపు వొడ్డున కూర్చున్న కనకారావూ, పద్మా చూస్తున్నారు. పద్మ లేచివొచ్చిన కారణాన్ని కనుక్కోవాలన్న అభిలాష కనకారావులో ఉదయం నుంచీ రేగుతోనే ఉంది. సమయం కోసం వేచి ఉన్నాడు.

'పద్మా! నువ్వు ఇంత సాహసం ఎట్లా చేశావు?' అన్నాడు.

నీటి అలలవంక చూసే పద్మ హృదయం ఒక్కసారి ఝల్లు మన్నది. కొద్ది క్షణాల్లోనే కనకారావు ప్రశ్నకు ఆమె హృదయం—సాగరఘోషను పోలిన ఉద్వేగానికి గురైంది. సమాధానం చెప్పేందుకు ఆమె చాల టైం తీసుకుంది.

'అంత సాహసం చేయటానికి మీరే కారణం.'

తుపుక్కున ముఖాన ఉమ్మి వేసినట్లయింది, కనకారావుకు. తను కారణమా? తను ఏం చేశాడు? తను ఎట్లా ప్రోత్సహించాడు? కొద్ది సేపటివరకూ కోలుకోలేక పోయాడు.

'నాకు అర్థం కావడం లేదు.'

'జ్ఞాపకం తెచ్చుకోండి. ఆ రోజు మా ఇంటి దగ్గర నన్ను కౌగలించుకొని, రెచ్చగొట్టి, నాలో బాగా ఉద్రేకం కలిగించి-చివరకు నన్ను ఆ బాధలో దిగవిడిచి వెళ్లారు. పురుష స్పర్శ ఎరుగని నేను ఆనాటి నుంచీ—పురుషునితోడి సంబంధాన్ని వాంఛించాను. మా బజారు చివర నీల కంఠేశ్వరరావు నా వంక తరుచూ చూసి నవ్వడం అప్పటికే అలవాటు. అతన్ని ఇట్టే ఆకర్షించాను. ఆ మత్తులో అతనితో, సంబంధాన్ని ఏర్ప రుచుకున్నాను. చివరకు అతనితో-నగలూ, కొంత డబ్బుతోపాటు లేచి వొచ్చాను—'

సిగ్గుపడ్డాడు, కనకారావు. వెన్నెల్లో ఆమె నేత్రాలకేసి చూశాడు. అతనిలో ఆమెమీద వాంఛ మళ్ళీ తలఎత్తింది. వెన్నెల కాంతీ, సముద్రం నుంచి వీచే చల్లగాలీ, ఏకాంతమూ-అతని శరీరాన్ని మోహంలోకి త్రోసివేశాయి. జారిపోయిన కోర్కెలు—మళ్ళీ తమ బలాన్ని నిలవ దొక్కుకున్నాయి.

'పద్మా!' పద్మని తన వొళ్ళోకి లాక్కున్నాడు.

పద్మ విదిలించుకొని అవతలకు పోయింది. కోపంతో ఆమె ఉడికి పోతోంది. దెబ్బ తిన్న త్రాచుపాములాగ కనకారావు లేచాడు. అవమానపు పట్టుదల అతనిలో నూతన శక్తుల్ని సృష్టించింది. పద్మను బలవంతాన కౌగలించుకొని—వెన్నెల వెలుపులో, మనోహరపు గాలిలో, సముద్రపు వొడ్డున ముద్దు పెట్టుకున్నాడు. స్త్రీని జయించినట్టు, ఆశయసిద్ధి పొంది నట్టు-ఆనందపడ్డాడు.

కాని పద్మ అసహ్యించుకుంది. తిట్టింది. ఆ తిట్లను పొగడ్తలుగా స్వీకరించాడు కనకారావు. ఆ రాత్రి భోజనాల అనంతరం రూంలో పడుకున్న తరువాత—కనకారావు తను బీచిలో అవలంబించిన విధానం పట్ల విమర్శజరిపి చూసుకున్నాడు. అట్లా అవలంబించటంలో తన తప్పు ఏమాత్రం లేదని నిర్ణయించుకున్నాడు. ఆ నిర్ణయానికి వొచ్చిన మరుక్షణమే పద్మను అనుభవించాలి - అన్నకోర్కె ఒక బలమైన రూపాన్ని ఏర్పరచుకుంది.

పద్మ బెడ్‌మీద నిద్రపోయేందుకు ప్రయత్నిస్తోంది. కనకారావు వెళ్లి ఆమె పక్కలో కూర్చున్నాడు. ఆమె త్రుళ్లిపడి లేవబోయింది. ఆమె బుజాల్ని నొక్కిపట్టి, ఆమె ముఖంమీద తన ముఖాన్ని చేర్చాడు.

'ఛీ నీచుడా! ఇందుకా నువ్వు నన్ను ఇక్కడికి తీసుకు వచ్చింది. ముందు మర్యాదగా అవతలకుపో గోలచేస్తాను. నీస్వార్థాన్ని బయట పెడతాను' అని అరిచింది.

కనకారావుకు భయం వేసింది. తనంటే ఆమెకు ఇష్టంలేనట్టు పూర్తిగా అవగాహన చేసుకున్నాడు. కాని ఆమె మీద కోర్కె బలంగా ఏర్పడింది. ఎట్లా? ఆలోచించాడు.

'పద్మా! నేనంటే నీకంత అయిష్టత ఎందుకు? నీమీద నాకు మొదట్నుంచీ వాంఛ ఉంది. అప్పుడు నీ భావిని ఆలోచించి జాలితలచి విడిచిపెట్టాను. ఇప్పుడు అవకాశం లభించింది. నువ్వు నన్ను తృణీకరించి లాభం లేదు. నువ్వు ఒక్కదానివే ఇంటికి వెళ్ళలేవు. మా తండ్రీ వాళ్ళకు నచ్చజెప్పి, నీవుచేసిన పొరబాటును సమర్థించి-నిన్ను మళ్లీ 'స్త్రీ' గా లోకానికి చాటే బాధ్యత నాది. అటువంటి నన్ను నువ్వు ఇప్పుడు తృణీకరించి— లోకంముందు ఎట్లా తల ఎత్తుకోగలవు? ఆలోచించుకో!'

పద్మ ఏమీ మాట్లాడలేక పోయింది. ఆమె దుర్బల హృదయానికి-ఎదుటివ్యక్తి దౌర్జన్యాన్నీ, స్వార్థాన్నీ, అన్యాయాన్నీ, అవినీతినీ-ఎదుర్కొనే శక్తిలేదు. పరిస్థితులకు లొంగి పోవడమే-ఇన్నాళ్లుగా ఆమె పర్యవసానపు ఆశయంగా పరిణామం చెందుతూ వొస్తోంది.

కనకారావు ఆమెను కౌగిలించుకొని—ఇష్టం కలిగినచోటల్లా ముద్దు పెట్టుకున్నాడు. పద్మ అభ్యంతరం చెప్పలేదు. ఆ రాత్రి ఆమెతో ప్రణయంలో కొత్త అనుభూతుల్ని చూశాడు.

★

నరసయ్యగారికి—

మీ కూతురు పద్మ విశాఖపట్టణపు హోటల్లో ఎవడో యువకుడితో కులుకుతోంది. నేను స్వయంగా చూశాను. మీరు వెంటనే వెళ్ళి ఆ దుర్మార్గుడినుంచి తమ కూతుర్ని రక్షించుకోవలసింది.

—మీ శ్రేయోభిలాషి.

సంతకం లేదు. ఆశ్చర్యపోయాడు నరసయ్య ఆ ఉత్తరం చూసి. భార్యకు చదివి వినిపించాడు.

'మీరు వెంటనే వెళ్లి అమ్మాయిని తీసుకురండి. నిజమే అయి వుంటుంది. ఎవడో పేరు బయటపెట్టుకోవటం ఇష్టంలేక అట్టా రాశాడు. అంతే!' అని భార్య ప్రోత్సహించింది.

నరసయ్య ఆరాత్రి జనతా ఎక్స్‌ప్రెస్ ఎక్కాడు.

మరునాడు ఉదయం వాల్తేరులో దిగాడు. ముందుగా పోలీసు స్టేషనుకు వెళ్ళి—సబ్ ఇనస్పెక్టరుతో విషయమంతా చెప్పి, ఇద్దరు పోలీసుల్ని వెంట బెట్టుకొని హోటళ్ళు వెతుక్కుంటూ-అసలు హోటలు దగ్గరకు వొచ్చారు.

రూంలో కనకారావు పేపరు చదువుకుంటున్నాడు. పద్మ అద్దం ముందు నిలబడి తల దువ్వుకుంటోంది.

తలుపు చప్పుడైంది.

"ఎవరు ?" అన్నాడు.

జవాబులేదు. మళ్లీ తలుపు బద్దలయేట్లుగా చప్పుడు.

చివరకు పద్మ తలుపు తీసింది. నరసయ్యా, ఇద్దరు పోలీసులూ—

'నాన్నా!' అన్నది పద్మ ఆవుర్న ఏడుస్తూ తండ్రిని కౌగలించుకొని మరోపక్క కనకారావు వైపు అసహ్యంతో చూస్తూ పద్మ తండ్రిని కావలించుకున్న సమయంలోనే, పోలీసులు కనకారావును కావలించుకున్నారు.

★